# ఏం బొమ్మ తెచ్చావ్

వసుంధర

జ్వరం వచ్చి డాక్టర్ని కలిసొచ్చిన బామ్మని
మా పాప అడిగింది ఏం బొమ్మ తెచ్చావని
జాగింగుకి రోడ్లన్నీ తిరిగొచ్చిన నాన్నని
మా పాప అడిగింది ఏం బొమ్మ తెచ్చావని
పాటపాడి విజేతగా ఇల్లు చేరు అమ్మని
మా పాప అడిగింది ఏం బొమ్మ తెచ్చావని
ఆటల్లో దెబ్బ తగిలి గోలపెట్టు అన్నని
మా పాప అడిగింది ఏం బొమ్మ తెచ్చావని
ఊర్నించి ఫోన్‌చేయు అమ్మమ్మని తాతయ్యని
మా పాప అడిగింది ఏం బొమ్మ తెచ్చావని
అందంగా తీర్చిదిద్ది అద్దంలో చూపిస్తే
ప్రతిబింబం పాపనడిగె ఏం బొమ్మ తెచ్చావని
తెల్లబోయి మా పాప అటు చూస్తే ఇటు చూస్తే
అదో బొమ్మ ఇదో బొమ్మ అందరి చేతిలో బొమ్మ
బొమ్మలన్ని దానికిచ్చి అమ్మతో అన్నారంతా
ఆహా ఆహాహా ఏం బొమ్మ తెచ్చావని!